క్లుప్తంగా

శాంతియుతంగా పోరాటం చేయాలి



నినాదాలు చేస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: హక్కుల సాధన కోసం శాంతియుతంగా ర్యాలీ, సభలను నిర్వహించుకోవాలని పలువురు గొండ్వాన పంచాయతీ రాయిసెంటర్ సార్‌మేడిలు, దేవరీలు, గ్రామపటేళ్లు పిలుపునిచ్చారు. ఆదివారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చించుఘాట్ గ్రామంలో సమావేశం నిర్వహించారు. లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని విధి విధానాలపై సోమవారం నిర్వహించే ర్యాలీకి ఆదివాసీలు సిద్ధంగా ఉండాలన్నారు. లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని కేసు కోర్టులో ఉన్నందున ప్రతిఒక్కరూ చట్టాలను గౌరవించాలన్నారు.

'గౌడ నాయకుల అరెస్టు అప్రజాస్వామికం'

బోథ్: నిజామాబాద్ జిల్లాలోని తాళ్ల రాంపూర్ గ్రామంలో గౌడ సంఘం నాయకుల అరెస్టు అప్రజాస్వామికమని మోకు దెబ్బ మండల అధ్యక్షుడు అతికం బాబాగౌడ్ అన్నారు. ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మోకుదెబ్బ జాతీయ అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర గౌడ సంఘాల జేఏసీ అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్‌ను నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో అర్ధరాత్రి పోలీసులు అరెస్టు చేయడం సిగ్గుచేటన్నారు. దాడికి పాల్పడిన వారిని తక్షణమే అరెస్టు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సత్యపాల్ గౌడ్, రతన్ గౌడ్, యధా గౌడ్, రాజు గౌడ్, కిష్టగౌడ్ పాల్గొన్నారు.

భగత్‌సింగ్ టాలెంట్ టెస్ట్ విజయవంతం



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

బోథ్: ఆలిండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన భగత్‌సింగ్ టాలెంట్ టెస్ట్- 2025 విజయవంతంగా ముగిసింది. ఈ పరీక్షకు వివిధ పాఠశాలల నుంచి దాదాపు 650 మంది విద్యార్థులు హాజరయ్యారు. భగత్‌సింగ్ స్ఫూర్తి, దేశభక్తి, విద్యాసక్తిని విద్యార్థుల్లో పెంపొందించాలన్న లక్ష్యంతో పరీక్ష నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. పరీక్షా ఫలితాలను సెప్టెంబర్ 28న భగత్‌సింగ్ జయంతి సందర్భంగా ప్రకటించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మున్సిఫ్ ప్రేమ్, సంతోష్, ముక్రముద్దీన్, గోవర్ధన్, నరేశ్, కార్తీక్, సాయి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.


పాదయాత్రకు అనుమతి ఇవ్వాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సిరికొండ: లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ.. తుడుందెబ్బ, ఆదివాసీ నాయకులు ఈనెల 24న సిరికొండ మండల కేంద్రం నుంచి ఇంద్రవెల్లి వరకు నిర్వహించే పాదయాత్రకు అనుమతి ఇవ్వాలని ఏఎస్పైకి వినతిపత్రం ఆదివారం అందించారు. కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి కొడప నగేశ్, యాదవ్ రావు, తోడసం అమృత్ రావు, మాజీ సర్పంచ్ రఘురాం, పెందుర్ అనిల్ కుమార్, పెందుర్ మహేశ్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న సభ్యులు

సిరికొండ: ఇటీవల మండలంలోని భీంపూర్ గ్రామానికి చెందిన బాలింత తోడసం ఏత్మబాయి మృతితో అనాథగా మారిన చిన్నారి కోసం అభిమాన్యు గ్రూప్ సభ్యులు అండగా నిలిచారు. ఆదివారం రూ. 85,550లను చిన్నారి కుటుంబసభ్యులకు అందజేశారు. అభిమాన్యు గ్రూప్ సభ్యులు మెస్రం శేఖర్ బాబు, సిడాం లాల్‌సాబ్, దుర్వ జంగు, మెస్రం దేవ్ రావు, కొడప నగేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఐకేపీ వీవోఏ జిల్లా కార్యవర్గంలో చోటు

బోథ్: ఆదిలాబాద్ జిల్లా ఐకేపీ (ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీసెస్) వీవోఏ (విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్స్) జిల్లా కమిటీని శనివారం ఉట్నూరులో ఎన్నుకున్నారు. సానాల మండలానికి చెందిన పవార్ శ్యాంరావ్ కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సమస్యల్లో ఆలయం..!


- ఉరుస్తున్న గర్భగుడి
- లీకేజీ నీటితో పూజలకు అంతరాయం
- త్వరలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- పట్టించుకోని దేవాదాయ శాఖ



శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయం

జైనథ్: మండల కేంద్రంలోని అతి ప్రాచీనమైన శ్రీలక్ష్మీ నారాయణ స్వామి దేవాలయంలో నవంబర్ 2 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఆలయం నుంచి లక్షల్లో ఆదాయం ఉన్నా.. దేవాదాయశాఖ కేవలం ఆదాయం పైనే దృష్టి పెడుతుంది కానీ అభివృద్ధిపై దృష్టి పెట్టడడం లేదని భక్తులు ఆరోపిస్తున్నారు. గర్భగుడిలో పైకప్పు నుంచి వర్షపు నీరు పడడం ఆందోళనకు గురిచేస్తోంది. వర్షం పడిన ప్రతిసారీ గర్భగుడిలో నీటి లీకేజీ కారణంగా పూజలు, నిత్యకార్యక్రమాలకు అంతరాయం కలుగుతోంది. భక్తులు ఎంతగానో ఎదురుచూస్తున్న బ్రహ్మోత్సవాలకు మరికొన్ని రోజులు మాత్రమే మిగిలి ఉన్నప్పటికీ, అధికారులు సమస్యను పట్టించుకోవడం లేదు. ఆలయ పునరుద్ధరణ, మరమ్మతులు పనులు చేయాలని పలుమార్లు విజ్ఞప్తి చేసినా.. అధికారులు హామీలకే పరిమితం అవుతున్నారని విమర్శలు ఉన్నాయి. భక్తుల విశ్వాసానికి నిలయమైన దేవాలయం ఇలాంటి సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కోవడం దురదృష్టకరమని, వెంటనే మరమ్మతులు చేపట్టి బ్రహ్మోత్సవాల కంటే ముందే సమస్యను పరిష్కరించాలని వారు భక్తులు కోరుతున్నారు.

మరమ్మతులు చేయాలి



అతి పురాతనమైన దేవాలయాన్ని కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. గర్భగుడిలోకి నీరు రావడంతో పూజ కార్యక్రమాలకు అంటకం కలుగుతుంది. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని మరమ్మతులు చేయాలి. – మాచర్ల నారాయణ, జైనథ్

పట్టించుకోవడం లేదు



కొన్ని ఏళ్ల నాటి చరిత్ర గల ఆలయాన్ని పట్టించుకోకపోవడం చాలా బాధాకరం. అధికారులు ఆలయం నుంచి వచ్చే ఆదాయాన్ని చూస్తున్నారు అభివృద్ధిపై దృష్టిసారించడం లేదు. ఆలయంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి.
– దువాస స్వామి జైనథ్ గ్రామస్తుడు

పురావస్తు శాఖకు సమాచారం ఇచ్చాం

గర్భగుడిలో వర్షపు నీరు కు రుస్తుందని పురావస్తుశాఖ ఏడీకి సమాచారం ఇవ్వడం జరిగింది. అదే విధంగా స్థానిక ఎమ్మెల్యే దృష్టికి కూడా తీసుకువెళ్లాం. పురావ స్తు శాఖ అధికారులు వచ్చిన వెంటనే పనిని పూర్తి చేస్తామని తెలిపారు.
– చంద్రశేఖర్, ఆలయ ఈవో

కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళి



బోథ్: విగ్రహానికి పూలమాల వేస్తున్న గజేందర్



నేరడిగొండ: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే



ఆదిలాబాద్‌రూరల్: నివాళులర్పిస్తున్న జోగు రామన్న

నేరడిగొండ: తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ పాత్ర ఎంతో కీలకమని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని ఆయన నివాసంలో ఆదివారం కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రత్యేక స్వాతంత్ర పోరాటం, నిజాం నిరంకుశ వ్యతిరేక ఉద్యమం చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో నేరడిగొండ మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, ఏనుగు కృష్ణారెడ్డి, అల్లూరి శివారెడ్డి, సదానందం, రాథోడ్ సురేందర్, మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: తెలంగాణ తొలితరం ఉద్యమంలో తన పదవులను సైతం లెక్క చేయకుండా పోరాడిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీనని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదివారం కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయం సమీపంలోని కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి, చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తుది శ్వాస వదిలే ఉన్నంత వరకు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం కృషి చేశారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అలాల అజయ్, మంచికట్ల ఆశమ్మ, జిట్ట రమేశ్, బొమ్మకంటి రమేశ్, దేవిదాస్, మోర ఆశన్న, అనుముల ఊషన్న, సామల ప్రశాంత్, జ్యోతి పాల్గొన్నారు.

బోథ్: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అపారమైన త్యాగాలు చేసిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు మరువలేనివని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్ అన్నారు. బోథ్ మండల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పట్టణ కేంద్రంలో, ధన్నూర్(బి) గ్రామంలో ఆయన వర్ధంతిని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొండా లక్ష్మణ్ బాపూజీ వంటి నిబద్ధత, నిజాయితీ కలిగిన నాయకులు చాలా అరుదుగా ఉంటారని పేర్కొన్నారు. నాయకులు ఆసాల సదాశివ్, బొడ్డు గంగారెడ్డి, గొర్లరాజు యాదవ్, మెరుగు భోజన్న, నర్సయ్య, మాసం అనిల్, పోతారెడ్డి, నారాయణరెడ్డి, ఉమేష్, కుర్మే మహేందర్ పాల్గొన్నారు.

చిన్నారుల ప్రతిభను గుర్తించాలి



బాలకేంద్రం చిన్నారులతో ఎంఈవో సోమయ్య

ఆదిలాబాద్: తల్లిదండ్రులు చిన్నారుల్లోని ప్రతిభను గుర్తించాలని ఆదిలాబాద్‌అర్బన్ ఎంఈవో సోమయ్య అన్నారు. నృత్య, కరాటే పోటీల్లో ప్రతిభ కనబర్చిన జిల్లా కేంద్రంలోని బాలకేంద్రానికి చెందిన చిన్నారులను ఆదివారం సన్మానించారు. చిన్నారులు ఎంతో సృజనాత్మకంగా ఉంటారని తెలిపారు. విద్యతో పాటు క్రీడలు, కళపై ఆసక్తిని ప్రదర్శిస్తుంటారని పేర్కొన్నారు. చిన్నప్పుడే తల్లిదండ్రులు వారిలోని సామర్థ్యాన్ని గుర్తించి ప్రోత్సహించాలని కోరారు. ఇటీవల నిర్వహించిన ఆలిండియా కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకోవడం అభినందనీయమని కొనియాడారు. సన్మానం పొందిన వారిలో కొండ్ర అలైఖ్య, సన్నిధి దేశ్‌ముఖ్, ఠాకూర్ హర్షిణి, దువాస హర్షిణి, చెన్న మోక్ష, గడ్డం శ్రీనిధి, లింగంపల్లి సాయికార్తిక ఉన్నారు. కార్యక్రమంలో బాలకేంద్రం సూపరింటెండెంట్ మెట్టు రవి, డ్రాయింగ్ ఇన్‌స్ట్రక్టర్ చంద్రకళదేవి, డ్యాన్స్ మాస్టర్ దత్తు, కరాటే మాస్టర్ జగన్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పనుల పరిశీలన



లబ్ధిదారుడితో మాట్లాడుతున్న గజేంధర్

బోథ్: బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆడే గజేందర్ ఆదివారం బోథ్ మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి, నిర్మాణ పనుల పురోగతి, ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పేదవారు ఇల్లు కట్టుకుని గృహ ప్రవేశం చేసినప్పుడే తమ విజయం సాధించినట్లు అవుతుందన్నారు. బోథ్‌లో ఎవరూ ముందుగా గృహ ప్రవేశం చేస్తే వారి ఇంటికి బట్టలు, మేకను తీసుకొని వస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో అన్నదానం



అన్నదానం చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: తిరుమల చారిటబుల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో అన్నదానం నిర్వహించారు. భారీ వర్షంలోనూ కార్యక్రమాన్ని చేపట్టారు. దూర ప్రాంతాల నుంచి రైలు మార్గం ద్వారా జిల్లా కేంద్రానికి వచ్చిన వారికి అన్నం వడ్డించారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు బండ అనిల్ కుమార్, సామల రవి, సునిల్ కుమార్, నరేశ్, ఉదయ్‌కిరణ్, సుమన్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్: ఆకలితో ఉన్నవారికి అన్నదానం గొప్ప కార్యమని వాసవి అమావాస్య ప్రసాద సమితి ప్రధాన కార్యదర్శి దినకర్ అన్నారు. ఆదివారం మహాలయ అమావాస్య సందర్భంగా రిమ్స్‌లోని సత్యసాయి నిత్యాన్నదాన సేవా కేంద్రంలో అన్నదానం నిర్వహించారు. అంతకుముందు సత్యసాయి బాబా చిత్రపటానికి ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో చంద్రకాంత్, ఉల్లాస్, రమేశ్ పాల్గొన్నారు.

ప్రజావాణి సద్వినియోగం చేసుకోవాలి

ఇచ్చోడ: మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దార్ జాదవ్ రమేశ్ కోరారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతీ సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సమస్యలపై ప్రజల నుంచి నేరుగా దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు.

ఆలయాలు ముస్తాబు

ఇచ్చోడ: దసరా పండుగ సమీస్తున్నందున దేవాలయలను ముస్తాబు చేస్తున్నారు. మండల కేంద్రంలో మైసమ్మ ఆలయానికి ఆదివారం గ్రామస్తుల ఆధ్వర్యంలో రంగులు వేయడం ప్రారంభించారు. దసరా రోజు ఆలయం వద్ద గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేసి దసరా ఉత్సవాలను జరుపుకుంటారు. దీంతో ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నారు.

మత విద్వేషాలు రెచ్చగొడితే చర్యలు

ఇచ్చోడ: సోషల్ మీడియాలో మత విద్వేషాలు రెచ్చగొడితే చర్యలు తప్పవని ఇచ్చోడ సీఐ బండారి రాజు అన్నారు. ఆదివారం ఇచ్చోడలో విలేకరులతో మాట్లాడారు. మండలంలోని ముఖరా(బి)లో శనివారం జరిగిన ఘటనలో ఓ యువకుడు అనుమానస్పదంగా మృతి చెందినట్లు కేసు నమోదైందన్నారు. సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేసిన వారిపై నిఘా ఉంటుందన్నారు. మత విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు పెట్టిడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

విలువైన వస్తువులు భద్రపర్చుకోవాలి

ఆదిలాబాద్‌రూరల్: దసరా పండుగ సెలవులను దృష్టిలో ఉంచుకొని ఇంటికి తాళం వేసి ఇతర ప్రాంతాలకు వెళ్తే వారు విలువైన వస్తువులను భద్రపర్చుకోవాలని ఆదిలాబాద్ రూరల్ ఎస్సై విష్ణు వర్ధన్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడారు. ఇంటికి తాళం వేసి ఇతర ప్రాంతాలకు వెళ్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానితులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

పేకాటాడిన తొమ్మిది మందిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ఖుర్షీద్ నగర్‌లో గల సీడబ్ల్యూసీ గోదాం సమీపంలో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. పేకాట ఆడుతున్నట్లు పక్కా సమాచారం రావడంతో ఆదివారం దాడి చేసినట్లు పేర్కొన్నారు. తొమ్మిది మందిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించినట్లు వివరించారు. వీరి నుంచి రూ.4240 నగదుతో పాటు పేకాట ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

నమూనా భవనం ప్రారంభించేదెప్పుడో?



తాంసిలో నిర్మించిన ఇందిరమ్మ నమూనా భవనం

తాంసి: ఇందిరమ్మ ఇళ్లపై అవగాహన కోసం ప్రతీ మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం నమూనా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను చేపట్టింది. తాంసి మండల కేంద్రంలో సైతం ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో హౌసింగ్ శాఖ అధికారుల పర్యవేక్షణలో నమూనా ఇంటి నిర్మాణాన్ని చేపట్టారు. గత నెల రోజుల క్రితం భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. అయినా.. గృహన్ని ప్రారంభించడంలో అధికారులు జాప్యం చేస్తున్నారు. వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చిన ప్రజలు భవనాన్ని త్వరగా ప్రారంభిస్తే ప్రజలు నమూనా ఇంటిని చూసే అవకాశం ఉంటుందని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు భవనాన్ని త్వరగా ప్రారంభించాలని మండలవాసులు కోరుతున్నారు.

జయప్రదం చేయండి

ఖానాపూర్: స్థానిక సంస్థల్లో జనాభా ప్రకారం విశ్వబ్రాహ్మణులకు రాజకీయ పార్టీలు సీట్లు కేటాయించాలని విశ్వబ్రాహ్మణ చైతన్యయాత్ర నియోజకవర్గ కన్వీనర్ దేశరాజి వెంకటేశ్ అన్నారు. ఈనెల 17న విశ్వబ్రాహ్మణుల ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక చైతన్యం కోసం విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ అధినేత విశ్వనాథుల పుష్పగిరి చేపట్టిన 1500 కిలోమీటర్ల చైతన్య పాదయాత్ర ఆదివారం ఖానాపూర్ చేరుకుంది. విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు స్వాగతం పలికారు.

రోడ్లపైనే చెత్తాచెదారం



జీసీసీ కార్యాలయంలో రోడ్డుపై ఉన్న చెత్త

ఇచ్చోడ: మేజర్ పంచాయతీలో రోడ్లపై పేరుకుపోయిన చెత్తాచెదారం కంపుకొడుతోంది. మండల కేంద్రంలోని జీసీసీ కార్యాలయం గేట్ ఎదుట ప్రధాన రోడ్డుపై చెత్తను తొలగించడం లేదు. దీంతో ఆ ప్రాంతం అధ్వానంగా మారింది. రోడ్లపై చెత్త వేయకుండా సంబంధిత పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలి

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



అంబారావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే

నేరడిగొండ: నాణ్యమైన విద్యాబోధన చేసి విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని తమ నివాసంలో ఇటీవలే ఆదిలాబాద్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎన్నికైన కుంటాల ఏహెచ్ఎస్ జాదవ్ అంబారావును ఆదివారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో శాలువాతో సత్కరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేసినందుకు అవార్డు దక్కడం గర్వకారణమన్నారు. భవిష్యత్తులోనూ మరింత నాణ్యమైన విద్యాబోధన చేసి ఇలాంటి అవార్డులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, అల్లూరి శివారెడ్డి, రాథోడ్ సురేందర్, ఆడె కైలాష్, రాథోడ్ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్



చెక్కు అందజేస్తున్న గోక గణేశ్‌రెడ్డి

తలమడుగు: నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ వరమని మాజీ జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కజ్జర్ల గ్రామానికి చెందిన అరక గణేష్ కుటుంబసభ్యులకు సీఎం సహాయ నిధి కింద మంజూరైన 13,500 చెక్కును కుటుంబసభ్యులకు అందించారు. పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు ఆరోగ్యశ్రీ పథకాన్ని పెంచడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బాబాన్న, ఎంపీటీసీ కమలాకర్, శ్రీనివాస్, పూర్ణచందర్, సంతోష్, పాల్గొన్నారు.

బోథ్: బోథ్ మండలంలోని కంటేగాం గ్రామానికి చెందిన నందుకేశవ్‌కు మంజూరైన రూ. 48,000ల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆడే గజేందర్ ఆదివారం అందజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేద ప్రజలకు చేరువ తాయన్నారు.

ముస్తాబైన దుర్గామాత మండపాలు



ముస్తాబైన మండపం

బోథ్: దుర్గా నవరాత్రుల సందర్భంగా బోథ్ పట్టణ కేంద్రంలోని దుర్గామాత మండపం అందంగా ముస్తాబైంది. ప్రతీ ఏడాది వినూత్నంగా అలంకరణలతో ఆకట్టుకునే విధంగా ముస్తాబు చేస్తున్నారు. దుర్గా కమిటీ అధ్యక్షుడు పాలిక్ రమేశ్ మాట్లాడుతూ.. సోమవారం నుంచి నవరాత్రులు ప్రారంభం అవుతాయని, సోమవారం ఉదయం 11 గంటలకు దేవి శోభాయాత్ర మొదలవుతుందన్నారు.

26 నుంచి భరతనాట్య ప్రదర్శన

దుర్గా నవరాత్రి ఉత్సవాలలో భాగంగా భరతనాట్య ప్రదర్శనను ఈనెల 26న నిర్వహించనున్నట్లు బోథ్ పట్టణ దుర్గా కమిటీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఆసక్తి గల విద్యార్థులు పేరు నమోదు చేసుకోవాలని కమిటీ సభ్యులు కోరారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



ప్రతిజ్ఞ చేస్తున్న సంస్థ సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: యువత మాదకద్రవ్యాలు, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్ సంస్థ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దేవిదాస్ దేశ్‌పాండే అన్నారు. నషాముక్త్ వికసిత్ భారత్ కార్యక్రమంలో ఆదివారం జిల్లా కేంద్రంలో అవగాహన కల్పించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, మంచి బాటలో నడిచి దేశాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. అనంతరం నషాముక్త్ పై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వయోవృద్ధుల సమాఖ్య అసోసియేట్ అధ్యక్షుడు దేవిదాస్ దేశ్‌పాండే, పళ్ల సత్యనారాయణ, శంకర్, గంగయ్య, ప్రకాష్, దయాకర్ రెడ్డి, లక్ష్మణ్, రాజీఉద్దీన్, పూర్ణచంద్ర, శైలజ పాల్గొన్నారు.